మన సమగ్ర ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
ప్రజావాణి ఎప్పటి వార్తలు అప్పుడే... 5 PM
బుధవారం , 09, సెప్టెంబర్, 2026
తెలుగు డైలీ
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY
https://epaper.prajavaani.net

## శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్
# హరీశ్‌రావు, కేటీఆర్‌తో సహా 22 మంది!

- ఎర్రవల్లి వద్ద 'చావుడప్పు' నిరసనలపై బీఆర్ఎస్ సభ్యుల ఆందోళన
- సభను అడ్డుకుంటున్నారని మంత్రి శ్రీధర్‌బాబు ఆరోపణ
- బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్‌పై తీర్మానం
- సభ జరిగే అన్ని రోజులకూ సస్పెన్షన్ వర్తింపు
- సభ 10 నిమిషాలు వాయిదా





**హైదరాబాద్ :**తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ సభ్యులపై స్పీకర్ సస్పెన్షన్ వేటు వేశారు. కేటీఆర్, హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, కోవా లక్ష్మి, సునీతా లక్ష్మారెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ సభ్యులను సభ నుంచి సస్పెండ్ చేశారు. ఈ సెషన్‌లో సభ జరిగే అన్ని రోజులకు ఈ సస్పెన్షన్ వర్తించనుంది.సభ ప్రారంభమైన కొద్దిసేపటికే బీఆర్ఎస్ సభ్యులు నిన్నటి ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వద్ద 'చావుడప్పు' నిరసనలపై ఆందోళనకు దిగారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. బీఆర్ఎస్ సభ్యులు సభా కార్యక్రమాలను అడ్డుకుంటున్నారని మంత్రి శ్రీధర్‌బాబు ఆరోపించారు.దాదాపు గంటసేపటి నుంచి బీఆర్ఎస్ సభ్యులు సభను అడ్డుకుంటున్నారని మంత్రి తెలిపారు.
వారిని సస్పెండ్ చేయాలని స్పీకర్‌ను కోరుతూ తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని సభ ఆమోదించింది.దీంతో బీఆర్ఎస్ సభ్యులను ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెండ్ చేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు. అనంతరం సభను 10 నిమిషాల పాటు వాయిదా వేశారు.

## సొంత పార్టీ మహిళా ఎమ్మెల్యేలతో
# ఇలా ప్రవర్తిస్తారా



**హైదరాబాద్, సెప్టెంబర్ 9:** బీఆర్ఎస్‌పై మంత్రి సీతక్క విరుచుకుపడ్డారు. సొంత పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దుర్మార్గంగా వ్యవహరించారని వ్యాఖ్యానించారు. ఈరోజు (బుధవారం) మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. మహిళా ఎమ్మెల్యేల పట్ల బీఆర్ఎస్ సభ్యులు అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించారని విమర్శించారు. దీనికి సంబంధించిన విజువల్స్‌ను మంత్రి విడుదల చేశారు. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రా రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవ లక్ష్మిని వెనుక నుంచి ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, సుధీర్ రెడ్డి తోసేశారని మంత్రి తెలిపారు. గంగుల కమలాకర్. మహిళా ఎమ్మెల్యేలను వెనుక నుంచి నెట్టుకుంటూ ముందుకు వచ్చారన్నారు. పక్కపక్కన నిలుచున్న ఇద్దరు మహిళా ఎమ్మెల్యేలను తాకుకుంటూ సుధీర్ రెడ్డి మధ్యలోకి వచ్చారన్నారు. ఇద్దరు మహిళా సభ్యుల మధ్యకు చొరబడాల్సిన అవసరం ఏంటి అని ప్రశ్నించారు. మహిళా నేతలను అతుక్కుని ఎందుకు నిలబడ్డారని నిలదీశారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి, సబితమ్మపై ఆ పార్టీ సభ్యులే చేయి వేశారని తెలిపారు. మహిళా నేతల పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలది కీచకపర్వం అంటూ మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు.


## కేసీఆర్ ఫాంహౌస్ వద్ద శుద్ధి..
# అసెంబ్లీలో తీవ్ర దుమారం

- నిన్న కేసీఆర్ ఫాంహౌస్ వద్ద నిరసనతెలిపిన కాంగ్రెస్ ఎస్సీ విభాగం, దళిత సంఘాలు




**హైదరాబాద్ :**
తెలంగాణ శాసనసభ మూడో రోజు సమావేశాలు ప్రారంభం కాగానే సభలో తీవ్ర దుమారం చెలరేగింది. నిన్న సిద్దిపేట జిల్లా ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్ వద్ద కాంగ్రెస్ ఎస్సీ విభాగం నేతలు, దళిత సంఘాలు నిరసన తెలిపిన అనంతరం... బీఆర్ఎస్ నేతలు ఆ ప్రాంతాన్ని శుద్ధి చేశారంటూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సభలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులు నిరసన తెలిపి వెళ్లిన స్థలాన్ని శుద్ధి చేయడం వెనుక బీఆర్ఎస్ నాయకుల తీవ్రమైన కులతత్వం బయటపడిందని... ఇది యావత్ దళిత సమాజ ఆత్మగౌరవాన్ని, హక్కులను తీవ్రంగా అవమానించడమేనని విమర్శించారు.
దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను అసెంబ్లీ గేటు వద్ద బూతులు తిట్టిన అంశాన్ని మరిచిపోకముందే... బీఆర్ఎస్ మరోసారి దళితుల పట్ల తమకున్న వివక్షను నిరూపించుకుందని మండిపడ్డారు. ఈ శుద్ధి వ్యవహారంపై సభలో సమగ్ర చర్చ జరగాలని ఆయన పట్టుబట్టారు.మరోవైపు, మంత్రి ప్రసంగానికి అడ్డుతగులుతూ బీఆర్ఎస్ సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఆవరణలో బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై, వారిపై జరిగిన అనుచిత ప్రవర్తనపై ప్రభుత్వం తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్లకార్డులతో నినాదాలు చేశారు. ఇరువైపులా నేతల పోటాపోటీ నినాదాలు, హంగామాతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది.

## సభ ముందుకు పంచాయతీ రాజ్
# సవరణ బిల్లు



**హైదరాబాద్ :** మూడో రోజు అసెంబ్లీ సమావేశాలు . ప్రశ్నోత్తరాలతో సభ మొదలవుతుంది. అనంతరం పంచాయతీరాజ్ సవరణ చట్టానికి సంబంధించిన కీలక బిల్లును మంత్రి సీతక్క సభలో ప్రవేశపెట్టనున్నారు. తెలంగాణ పంచాయతీరాజ్ నాలుగో సవరణ బిల్లు-2026పై సభలో చర్చ జరగనుంది. గ్రామీణపాలన, పంచాయతీరాజ్? వ్యవస్థకు సంబంధించిన అంశాల నేపథ్యంలో ఈ బిల్లుపై అధికార, విపక్షాల మధ్య చర్చ కొనసాగనుంది. స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యల వ్యవహారంపై మొదటి రెండు రోజులు చర్చలు జరిగాయి. దీంతో శనివారం కూడా శాసనసభ సమావేశాలు కొనసాగనున్నాయని సభ్యులు తెలిపారు. శాసనసభలో చర్చ ముగిసినప్పటికీ ఇవాళ మండలిలో వాడీవేడిగా చర్చలు జరిగే అవకాశాలున్నాయి.ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే యోచనలో బీఆర్ఎస్ : శాసనసభ, శాసనమండలి సమావేశాల నేపథ్యంలో బీఆర్ఎస్ ప్రధానంగా గత రెండు రోజులుగా చోటు చేసుకున్న పరిణామాలపైనే దృష్టి సారించింది. సభల్లో రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా ఆయా అంశాలను బలంగా ప్రస్తావించాలని పార్టీ నిర్ణయించింది. ముఖ్యంగా మహిళా శాసనసభ్యుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుతో పాటు, ఎర్రవల్లిలోని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివాసం వద్ద చోటుచేసుకున్న పరిణామాలను ఉభయ సభల్లో ప్రధానంగా లేవనెత్తాలని ఆ పార్టీ భావిస్తోంది. మహిళా శాసనసభ్యుల పట్ల పోలీసులు అనుచితంగా వ్యవహరించారంటూ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నిన్న సభలో ఆ అంశాన్ని ప్రస్తావించింది. విచారణ చేయిస్తామని సభాపతి ప్రసాద్ కుమార్, మంత్రి శ్రీధర్ బాబు ప్రకటించారు. హోంశాఖను చూస్తున్న సీఎం బాధ్యత వహించాలంటున్న గులాబీ పార్టీ సభలో ఇవాళ కూడా ప్రభుత్వాన్ని నిలదీయాలని నిర్ణయించినట్లు సమాచారం. మండలిలో తమకు ఉన్న మెజార్టీని దృష్టిలో ఉంచుకుని, చర్చల్లో పైచేయి సాధించాలని బీఆర్ఎస్ భావిస్తోంది.

## మా ఫొటోలను మార్ఫింగ్ చేసి
# వాడుతున్నారు




**హైదరాబాద్ :** రేవంత్ సర్కార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలపై చర్చించడం చేతగాక తమపై అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. బుధవారం నాడు అసెంబ్లీ సమావేశాలకు ముందు మీడియాతో చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. మా ఫొటోలను ఏఐ ఉపయోగించి మార్ఫింగ్ చేసి వాడుతున్నారని అన్నారు. ఫొటోల మార్ఫింగ్‌పై సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేస్తామని తెలిపారు.ఇదిలా ఉంటే కేటీఆర్, హరీశ్‌రావుపై కేసుల పరంపర కొనసాగుతోంది. సోమవారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా టీషర్ట్‌లు విప్పారని మహిళా కానిస్టేబుల్‌తో రేవంత్ ప్రభుత్వం ఫిర్యాదు చేయించింది. ఈ మేరకు వారిపై కేసులు పెట్టించింది.

## పి.గన్నవరం నియోజకవర్గంలో రైతులకు పట్టాదారు
# పాసుపుస్తకాల పంపిణీ



**కోనసీమ జిల్లా:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పర్యటించనున్నారు. పి.గన్నవరం నియోజకవర్గంలో పర్యటించి, రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా రైతులతో నేరుగా సమావేశమై వారి సమస్యలు అడిగి తెలుసుకోనున్నారు.ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్ ప్రకారం.. ఉదయం 09:45 గంటలకు అమరావతి నుంచి బయలుదేరి 10:30 గంటలకు అంబాజీపేట మండలం ఇరుసుమండ గ్రామానికి చేరుకుంటారు. అక్కడి నుంచి 10:55 గంటలకు మాచవరం గ్రామానికి వెళ్లి రైతులతో సమావేశమవుతారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను స్వయంగా అందజేస్తారు.అనంతరం మధ్యాహ్నం 01:55 గంటలకు పండువారిపేటలో ఏర్పాటు చేసిన గ్రామసభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. పర్యటనలో భాగంగా సాయంత్రం 03:15 గంటలకు నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులతో చంద్రబాబు ప్రత్యేకంగా భేటీ కానున్నారు. ఈ కార్యక్రమాలన్నీ ముగించుకుని సాయంత్రం 05:40 గంటలకు ముఖ్యమంత్రి తిరిగి అమరావతికి బయలుదేరి వెళ్తారు. సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

## శాసనమండలి నుంచి
# బీఆర్ఎస్ వాకౌట్..



**హైదరాబాద్:**తెలంగాణ శాసనమండలిలోనూ రాజకీయ సెగలు తీవ్ర స్థాయికి చేరాయి. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలను మిగిలిన సమావేశాల కాలానికి సస్పెండ్ చేయడం మండలిలో దుమారం రేపింది. మండలిలో ఈ ఇద్దరు సభ్యుల సస్పెన్షన్ ప్రతిపాదనపై ప్రభుత్వం తీర్మానంప్రవేశపెట్టగా... దానిపై 'డివిజన్ ఓటింగ్' నిర్వహించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు పట్టుబట్టారు. అయితే ఓటింగ్‌కు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నిరాకరించడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు కాంగ్రెస్ ప్రభుత్వ ధోరణిని ఖండిస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు.మరోవైపు, అసెంబ్లీ గేటు వద్ద నిరసనల సందర్భంలో శాసనసభ స్పీకర్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలతో పాటు మహిళల ఎదుట దుస్తులు విప్పి నిరసన తెలిపారనే కారణాలతో వీరిద్దరిపై చర్యలు తీసుకోవాలని ఎథిక్స్ కమిటీకి మండలి ఛైర్మన్ రిఫర్ చేశారు.

# కొత్త బస్టాండ్‌లో గీజర్‌తో మంటలు

- ఏసీ, ఫర్నిచర్ రూమ్ దగ్ధం.. ఫైర్ సిబ్బంది అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం
- ఆ బిల్డింగ్ లో సోప్ తయారీ కేంద్రం ఉందన్న అనుమానాలు.








**రాజన్న సిరిసిల్ల, ప్రజావాణి**

కొత్త బస్టాండ్ ప్రాంతంలో ఓ ఇంట్లో గీజర్ కారణంగా మంటలు చెలరేగి ఏసీ, ఫర్నిచర్ ఉన్న రూమ్ పూర్తిగా దగ్ధమైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. రూమ్ నుంచి భారీగా పొగలు వెలువడటంతో చుట్టుపక్కల ప్రజలు ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న ఫైర్ సేఫ్టీ అధికారులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకురావడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

**ఇంట్లోనే సోప్ ఫ్యాక్టరీ నిర్వహణపై అనుమానాలు**

అయితే, ప్రమాదానికి గురైన భవనంలో సోప్ ఫ్యాక్టరీ నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. చిన్నపాటి గీజర్ కారణంగా ఇంతటి ప్రమాదం చోటుచేసుకుంటే, అక్కడ తయారీ యూనిట్ కొనసాగుతున్నట్లయి తే భద్రతా ప్రమాణాలు ఎలా ఉన్నాయనే చర్చ జరుగుతోంది.

**రెసిడెన్షియల్ భవనమా.. కమర్షియల్ వినియోగమా?**

భవనం రెసిడెన్షియల్ పర్మిషన్‌తో నిర్మించారా? లేక కమర్షియల్ వినియోగానికి అనుమతులు ఉన్నాయా? అనే ప్రశ్నలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. సోప్ తయారు నిర్వహణకపై మున్సిపల్, ఫైర్ సేఫ్టీ తదితర శాఖల నుంచి అవసరమైన అనుమతులు ఉన్నాయా? నిబంధనలకు అనుగుణంగానే కార్యకలాపాలు కొనసాగుతున్నాయా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. అధికారులు భవన నిర్మాణ అనుమతులు, వినియోగం, ఫైర్ సేఫ్టీ నిబంధనలు, ఫ్యాక్టరీ నిర్వహణకు సంబంధించిన అనుమతులను పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.

**లైన్ లోకి రాని మున్సిపల్ కమిషనర్**

కొత్త బస్టాండ్ ఓ బిల్డింగ్ దత్తమైన పొగ వ్యాపించి గది లో ఫర్నిచర్ వస్తువులు కాలిపోయిన ఘటన పై అందులో సోప్ తయారి కేంద్రం ఉందని ఆరోపణలపై ఎలాంటి భద్రత ప్రమాణాలు పాటిస్తున్నారో వివరాల కొరకు మున్సిపల్ కమిషనర్ కు కాల్ చెయ్యగా ఆన్సర్ చెయ్యడం లేదు రెసిడెన్సీ, కమార్షయల్ హ అనే సందేహం మాత్రం తిరడం లేదు. దీనిపై మున్సిపల్ అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైన ఉంది.

# అక్రమంగా ఇసుక తరలిస్తున్న బొలెరో వాహనం పట్టివేత



**కోహెడ, సెప్టెంబర్ 9 (ప్రజావాణి)**

రామంచ గ్రామం నుంచి కోహెడ మీదుగా సిద్దిపేటకు బొలెరో వాహనంలో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా కోహెడ పోలీసులు వాహనాన్ని పట్టుకున్నారు. కోహెడ గ్రామ శివారులో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న బొలెరో వాహనం [illegible]+-02-[illegible]-4931ను గుర్తించి కోహెడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై జెట్టి అజయ్ సాగర్ (28), నవాబ్‌పేట, చిగురుమామిడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా కోహెడ ఎస్సై పి. అభిలాష్ మాట్లాడుతూ అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, నిబంధనలు ఉల్లంఘించిన వారికి జైలు శిక్ష కూడా తప్పదని హెచ్చరించారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు నిరంతరం తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు.

# అంగన్వాడికి కేంద్రానికి తాళం వేసిన ఇంటి యజమాని.

## - అద్దె చెల్లించని అధికారులు.



**హుజూర్నగర్ సెప్టెంబర్ 9 (ప్రజావాణి)**

సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ మండల పరిధిలోని అమరవరం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి ఇంటి యజమాని తాళం వేసిన ఘటన తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. గత కొద్ది నెలలుగా ప్రభుత్వం నుంచి అద్దె బకాయిలు విడుదల కాకపోవడంతో విసుగు చెందిన భవన యజమాని అంగన్వాడి కేంద్రానికి తాళం వేసినట్లు సమాచారం. ఈ చర్య వల్ల కేంద్రం పరిధిలోని గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు రోజువారీ అందాల్సిన పౌష్టికాహార పంపిణీ నిలిచిపోయింది. ముఖ్యంగా ప్రభుత్వం అందించే గుడ్లు, బాలామృతం వంటి పోషకాహారం అందక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంగన్‌వాడీ కేంద్రం మూతపడటంతో పిల్లలు, మహిళలు నిరాశతో వెనుదిరగాల్సి వస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులు, మహిళల ఆరోగ్య పరిరక్షణకు కీలకమైన అంగన్‌వాడీ కేంద్రం ఇలా అద్దె బకాయిల కారణంగా మూతపడటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు మరియు ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, పెండింగ్‌లో ఉన్న అద్దె బకాయిలను వెంటనే చెల్లించి కేంద్రాన్ని పునఃప్రారంభించాలని గ్రామస్తులు, లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు. పోషకాహార పంపిణీలో ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని కోరుతున్నారు.

# లద్నూరులో బస్సు సౌకర్యం కోసం కల్పించాలని విద్యార్థుల ధర్నా

- స్థానిక ప్రజా ప్రతినిధుల సంపూర్ణ మద్దతు
- స్పందించని జనగామ డిపో మేనేజర్
- రెండు రోజుల్లో సమస్య పరిష్కరించపోతే... నిరంతర ధర్నా
- ఎస్సై ఆసిఫ్ హామీతో ధర్నా విరమించిన విద్యార్థులు






**మద్దూరు సెప్టెంబర్9, ప్రజా వాణి,**


మండలంలోని లద్నూరు నుండి ప్రతి రోజు జనగామ జిల్లా కేంద్రానికి విద్యా కోసం 30 మంది విద్యార్థులు బస్సులో ప్రయాణం చేసే విద్యార్థులకు జనగామ అర్ టి సి అధికారులు శాపంగా మారీ విద్యార్థుల జీవితాలతో చెలగటమడుతున్నారు. దీంతోబుధవారం లద్నూరు గ్రామానికి చెందిన పలువురు విద్యార్థులు గ్రామ ఉప సర్పంచ్ బెడద శివ కుమార్, ఎబివిపి నాయకుడు సోగాల మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ ముందు రోడ్డుపై రెండు గంటల పాటు బైఠాయించి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉప సర్పంచ్ శివ కుమార్, ఎబివిపి నాయకుడు సోగాల మనోజ్ కుమార్ మాట్లాడుతూ ఎప్పటినుండో మద్దూరు, లద్నూరు, మీదుగా బచ్చన్నపేట నుండి జనగామ వెళ్ళే బస్సు విద్యార్థుల కళాశాలకు సరైనా సమయంకు వెళ్ళేవారు. గత మూడు రోజుల క్రితం జనగామ డిపో అధికారులు తమ ఇష్టారాజ్యంగా బస్సు వేళలు మార్చి బచ్చన్నపేట నుండి ఆలేరు ద్వారా హైదరాబాద్ వెళ్తుండడంతో విద్యార్థులు బచ్చన్నపేటలో దిగి జనగామకు వెళ్ళే బస్సు కోసం గంటల తరబడి వేచి ఉండడంతో విద్యార్థులు కొన్ని క్లాసులు హాజరు కాలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ధర్నా చేస్తున్న విషయం తెలుసుకున్న మద్దూరు ఎస్సై మహమ్మద్ ఆసీఫ్ హుస్నాబాద్ ఏసిపి సదానందం, జనగామ అర్ టి సి అధికారులతో సంప్రదింపులు జరిపి రెండు రోజుల్లో యధావిధిగా జనగామ వరకు వెళ్లేందుకు చర్యలు తీసుకునేవిధంగా అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించే విధంగా కృషి చేస్తానని విద్యార్థులకు హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. విద్యార్థుల ధర్నాకు సంపూర్ణ మద్దతు తెలిపిన రేబర్తి పి ఏ సి ఎస్ వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, గ్రామ ఉప సర్పంచ్ శివ కుమార్, మాజీ సర్పంచులు రామడుగు బాల్ రాజ్, జీడికంటి సుదర్శన్, సురేష్, ఎబివిపి నాయకుడు సోగాల మనోజ్ కుమార్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

# తెలంగాణ తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసిన కూకట్పల్లి శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ మొలుగు ఆనంద్ రావు బిఆర్ఎస్ పార్టీ నాయకుడు.




**కూకట్పల్లి విలేజ్ (ప్రజావాణి) సెప్టెంబర్ 9 ప్రతినిధి మునిపల్లి నరేష్ యాదవ్.**

ప్రతి సంవత్సరం సెప్టెంబరు 9న తెలంగాణ అంతటా తెలంగాణ భాషా దినోత్సవం (తెలంగాణ తెలుగు భాషా దినోత్సవం) ఎంతో ఘనంగా జరుపుకుంటారు. తెలంగాణ మాతృభాష అస్తిత్వాన్ని, యాసలోని పదునును ప్రపంచానికి చాటిచెప్పిన ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని ఈ రోజును భాషా దినోత్సవంగా తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. 1. కాళోజీ నారాయణరావు జయంతితెలంగాణ ఉద్యమాల్లో తన కలంతో ప్రజా చైతన్యాన్ని రగిలించిన ధీరుడు కాళోజీ. ఆయన 100వ జయంతి సందర్భంగా, తెలంగాణ ప్రభుత్వం ఆయన జన్మదినమైన సెప్టెంబరు 9ని తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించి అధికారికంగా నిర్వహిస్తోంది. 2. బడి పలుకుల భాష కాదు.. పలుకుబడుల భాష!కాళోజీ భాష గురించి చెప్పిన ఒక ప్రసిద్ధ సూక్తి ఇప్పటికీ ఎంతో ఆదర్శవంతమైనది. "భాష రెండు విధాలు.. ఒకటి బడి పలుకుల భాష, రెండు పలుకుబడుల భాష; పలుకుబడుల భాషే ప్రజల అసలైన భాష" అని ఆయన నమ్మారు. తెలంగాణ గ్రామీణ ప్రజల సహజ సిద్ధమైన యాసను, మాండలికాన్ని గౌరవించడమే ఈ దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశం. 3. కాళోజీ సాహిత్య పురస్కారంఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో భాషా, సాహిత్య రంగాల్లో విశేష కృషి చేసిన ప్రముఖులకు రాష్ట్ర స్థాయి కాళోజీ సాహిత్య పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరిస్తారు. అలాగే జిల్లా కేంద్రాలు, పాఠశాలలు మరియు విద్యాసంస్థల్లో కవిసమ్మేళనాలు, వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణ ప్రజల జీవన విధానానికి, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే ఈ భాషా దినోత్సవం, మన మాతృభాషలోని వైవిధ్యాన్ని భవిష్యత్ తరాలకు సగర్వంగా [illegible] దోహదపడుతుంది.



# కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతు ప్రభుత్వం: మార్కెట్ కమిటీ చైర్మన్ మక్త జగన్మోహన్ రెడ్డి



**మన సమగ్ర ప్రజావాణి 09 (జోగిపేట్) సంగారెడ్డి జిల్లా ప్రతినిధి**

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటుందని జోగిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మక్త జగన్మోహన్ రెడ్డి అన్నారు. ఆందోల్ మండలం జోగిపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ.1.75 కోట్ల అంచనా వ్యయంతో 15 నూతన షాపుల నిర్మాణానికి బుధవారం ఆయన భూమిపూజ నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. "కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతు ప్రభుత్వం.. రైతు ప్రభుత్వం అంటేనే కాంగ్రెస్ ప్రభుత్వం" అని అన్నారు.

రైతులకు మార్కెట్ యార్డులో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మంత్రి దామోదర రాజనర్సింహ చొరవతో, ఆయన ఆదేశాల మేరకు రూ.1.75 కోట్లతో 15 కొత్త షాపుల నిర్మాణానికి భూమిపూజ చేసినట్లు చెప్పారు. మార్కెట్ యార్డులో జరుగుతున్న పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చూడాలని మంత్రి సూచించారని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారని పేర్కొన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ అడుగుజాడల్లో నడుస్తూ రైతులు, ప్రజల సంక్షేమానికి కృషి చేస్తానని మక్త జగన్మోహన్ రెడ్డి తెలిపారు. తనకు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అవకాశం కల్పించిన మంత్రి దామోదర రాజనర్సింహకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com